క్లుప్తంగా

తైవాన్ స్ప్రేయర్ల పంపిణీ



రైతులకు తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న ఏఓ పవన్ కుమార్

వెలుగోడు: వెలుగోడు, అబ్దుల్లాపురం రైతులకు స్థానిక రైతు సేవ కేంద్రంలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పీఎం కిసాన్ లబ్ధి పొందిన 76 శాతం మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. మిగతా రైతులు త్వరగా చేసుకోవాలని సూచించారు. 50శాతం రాయితీతో ఇస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'సూపర్ సిక్స్' అమలు చేయండి



మాట్లాడుతున్న పార్టీ జిల్లా నాయకులు

నందికొట్కూరు: సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది మాసాలు దాటిపోతున్నా కొత్తగా ఒక పింఛన్ కూడా మంజూరు చేయలేదన్నారు. ఇప్పటికైనా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు రామకృష్ణ, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేస్తేనే గుర్తింపు



ఎస్‌ఐ కేశవను సత్కరిస్తున్న రూరల్ సీఐ సురేష్‌కుమార్ రెడ్డి

కొత్తపల్లి: ఉద్యోగ రీత్యా నిబద్ధతతో పనిచేస్తేనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో బదిలీపై వెళ్తున్న ఎస్‌ఐ కేశవను సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ప్రజల పట్ల స్నేహభావంతో నడుచుకోవడం, విధుల పట్ల నిబద్ధతతో పనిచేయడం వల్ల సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. అనంతరం ఎస్‌ఐ ఎం.కేశవను సత్కరించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

మంచి చిత్రాలకు ప్రేక్షకుల ఆదరణ



వాహనానికి పూజ చేయిస్తున్న దర్శకుడు ఈశ్వరరెడ్డి

మహానంది: మంచి కథతో కూడిన చిత్రాలకు ఎప్పుడూ ప్రేక్షకుల ఆదరణ ఉంటుందని చిత్ర దర్శకుడు ఈశ్వరరెడ్డి తెలిపారు. మహానందీశ్వరుడి దర్శనార్థం మంగళవారం మహానందికి వచ్చారు. స్వామి, అమ్మవారి దర్శనం అనంతరం వాహనానికి పూజ చేయించుకున్నారు. తాను తీసిన మీ శ్రేయోభిలాషి చిత్రం మంచి ఆదరణ పొందిందన్నారు.

అలివి వలలు వేస్తే కఠిన చర్యలు



అలివి వలల నిర్వాహకులు, మత్స్యకారులతో మాట్లాడుతున్న మత్స్యశాఖ అధికారి

కొత్తపల్లి: కృష్ణా నది తీరం వెంట అలివి వలలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మత్స్యశాఖ అధికారి భరత్‌లాల్ నాయక్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని సంగమేశ్వరం పరిసర ప్రాంతంలోని కృష్ణానది తీరాన్ని పరిశీలించారు. స్థానిక వీఆర్వో వేణుగోపాల్‌తో కలిసి కృష్ణా తీరం వెంట పర్యటించి అలివి వలలు వేస్తున్న నిర్వాహకులు, మత్స్యకారుల తో మాట్లాడారు. ఉన్నతాధికారులు, స్థానిక తహసీల్దార్ ఆదేశాల మేరకు నదిలో చేపలు మాత్రమే పట్టాలని, అలివి వలలు వేస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని జాలర్లను హెచ్చరించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

బండిఆత్మకూరు: మండల పరిధిలోని వెంగళరెడ్డిపేటకు చెందిన ముగ్గురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. ఎర్రన్నతో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.15,380 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు



నందికొట్కూరులోని పరీక్ష కేంద్రంలో విద్యార్థులు



కొత్తపల్లిలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

పాములపాడు: స్థానిక ఏఎస్‌ఆర్ జెడ్పీహెచ్, ఏపీ మోడల్ స్కూళ్లలో నిర్వహించిన పదో తరగతి పరీక్షలు మంగళవారం నాటితో ముగిశాయి. పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు సంతోషంతో కేరింతలు కొట్టారు. ఒకరినొకరు ఆలింగనం, కరచాలనం చేసుకుంటూ ఫలితాలు వెలువడిన తరువాత మళ్లీ కలుద్దామంటూ వీడ్కోలు చెప్పుకున్నారు. కాగా పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు పూర్వ విద్యార్థులు, ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు నిమ్మరసం, మజ్జిగ పంపిణీ చేశారు. వీరిని ఎంఈఓ-2 సుభాషిణి దేవి అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రామ్మోహన్, చంద్రుడు, రామచంద్రరాయుడు, లక్ష్మణగౌడు, బాలరాజు, రమేష్ పాల్గొన్నారు.

● నందికొట్కూరు: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గత నెల 17న తెలుగుతో ప్రారంభమైన పరీక్షలు మంగళవారం సాంఘికశాస్త్రంతో పూర్తయ్యాయి. దీంతో విద్యార్థులు ఊపిరిపీల్చుకున్నారు. మండల వ్యాప్తంగా ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఎలాంటి మాస్‌కాపీయింగ్‌కు తావులేకుండా పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కాగా చివరి రోజు పరీక్షకు 1,328 మంది విద్యార్థులకు గానూ 1,314 మంది హాజరుకాగా 14 మంది గైర్హాజరైనట్లు విద్యాశాఖ మండల అధికారులు తెలిపారు.

● పగిద్యాల: మండలంలోని పాత ముచ్చుమర్రి, పగిద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, లక్ష్మాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రాల్లో 423 మంది విద్యార్థులకు గానూ 418 మంది హాజరైనట్లు మండల విద్యాధికారి సుభాన్ తెలిపారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించినట్లు ఎగ్జామ్ చీఫ్‌లు వెంకటస్వామి, మధుసూదన్‌రావు, క్రిష్ణమూర్తి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా రఫీ, జిలానీ, ఎల్లనాయుడు తెలిపారు.

● కొత్తపల్లి: మండల వ్యాప్తంగా చివరి రోజు సాంఘిక శాస్త్రం పరీక్షకు 248 మంది విద్యార్థులు హాజరయ్యారు. కొత్తపల్లి పరీక్షా కేంద్రంలో 171 మంది విద్యార్థులకు గాను 168 మంది హాజరుకాగా ముగ్గురు గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణ అధికారి వెంకటరమణాచారి తెలిపారు. గోకవరం పరీక్షా కేంద్రంలో 87 మంది విద్యార్థులకు గానూ 80 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని చీఫ్ ఎగ్జామినర్ వెంకటశివుడు తెలిపారు.

● జూపాడుబంగ్లా: మండల కేంద్రంలోని ఆదర్శ, ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు పరీక్షా కేంద్రాల చీఫ్‌లు రవికుమార్, వెంకటేశ్వర్లు, డిపార్టుమెంటల్ అధికారులు వెంకటేశ్వర్లు, స్వామిశేఖర్, ఇన్విజిలేటర్లు సీఐతో తెలిపారు.

● ఆత్మకూరు: పట్టణంలోని నిర్వహిస్తున్న పది పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ఎంఈఓ బాలాజీ నాయక్ తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, చైతన్య, డీపాల్, గాయత్రీ, పద్మావతి హైస్కూల్ కేంద్రాల్లో మార్చి 17 నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కాగా చివరి రోజు సాంఘిక శాస్త్రంతో పరీక్షలు ముగిశాయన్నారు.

● బండి ఆత్మకూరు: మండల పరిధిలోని మూడు పరీక్ష కేంద్రాల్లో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓలు ఆర్.



పాములపాడులో విద్యార్థులకు నిమ్మరసం పంపిణీ చేస్తున్న ఎంఈఓ సుభాషిణీదేవి

యశోద, జి.మోహన్ రెడ్డి తెలిపారు. చివరి రోజు 15 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వారు తెలిపారు.

● మహానంది: ఎం.తిమ్మాపురంలోని ఏపీ మోడల్ స్కూల్, గాజులపల్లెలోని జిల్లా పరిషత్ పాఠశాల, క్రీస్తు జ్యోతి పాఠశాల్లో మంగళవారం 541 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఎంఈఓ రామసుబ్బయ్య తెలిపారు. మూడు కేంద్రాల్లో కలిపి 15 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు.

నేడు అంబేడ్కర్ జయంతి నిర్వహణపై సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని అంబేడ్కర్ స్ఫూర్తి కేంద్రంలో బుధవారం అంబేడ్కర్ జయంతిపై సమావేశం నిర్వహించనున్నట్లు మాలమహానాడు నాయకులు మల్లయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాబిన్‌సన్ మాదిగ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ సమావేశంలో అంబేడ్కర్ జయంతి నిర్వహణపై చర్చించనున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ విగ్రహ కమిటీ సభ్యులు హాజరు కావాలన్నారు.

సర్వేలను త్వరగా పూర్తి చేయండి

నంద్యాల: గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా చేపట్టిన సర్వేలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సచివాలయ సర్వీసులు, ఉపాధి హామీ, హౌసింగ్ అంశాలపై ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన 7 వేల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జిల్లా, మండలాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద చలువ పందిళ్లు, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, హౌసింగ్ ఈఈ శ్రీహరి గోపాల్ పాల్గొన్నారు.

ముగిసిన తేనెటీగల పెంపకంపై శిక్షణ



సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

కొత్తపల్లి: మండలంలోని పాలెం చెరువు గూడెంలో తేనెటీగల పెంపకంపై ఏడు రోజులుగా ఇస్తున్న శిక్షణ మంగళవారం ముగిసింది. నంద్యాల వ్యవసాయ పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎం.జాన్సన్ మాట్లాడుతూ తేనెటీగల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులు పాటించి లాభాలు సాధించవచ్చన్నారు. తేనెటీగల పెంపకం చేపట్టినట్లయితే పంట సాగులో పుష్పాలు బాగా ఫలదీకరణం చెంది అధిక దిగుబడి పొందటానికి దోహదపడడంతో పాటు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. అనంతరం శిక్షణ పొందిన రైతులకు తేనెటీగల పెట్టెలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆంజనేయ, ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజర్ కేజీ నాయక్, సర్పంచ్ మసమ్మ, వ్యవసాయ శాస్త్రవేత్తలు కె.అశోక్ కుమార్, కె.మోహన్ విష్ణువర్ధన్, మండల వ్యవసాయ అధికారి మహేష్ పాల్గొన్నారు.

లక్ష్మీరంగనాథుడికి భారీగా ఆదాయం



వేలం పాటలు నిర్వహిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: తర్తూరు లక్ష్మీరంగనాథస్వామికి భారీగా ఆదాయం సమకూరింది. ఈనెల 6 నుంచి జాతర ప్రారంభం కానుండటంతో టెంకాయలు, లడ్డూప్రసాదం విక్రయం, కొబ్బరి చిప్పల పోగు చేసుకునేందుకు మంగళవారం ఆలయంలో వేలం పాటలు నిర్వహించారు. టెంకాయల విక్రయ హక్కులను నందికొట్కూరు రాజేష్ రూ.5,90,000లకు, లడ్డూప్రసాదాల విక్రయ హక్కులను కొణిదేల రంగస్వామి రూ.1,05,00లకు, కొబ్బరి చిప్పలపోగు హక్కును కొణిదేల బాలన్న రూ.2,00,000లకు దక్కించుకున్నారు. వేలం పాటల ద్వారా మొత్తం రూ.8,95,000ల ఆదాయం సమకూరింది. ఈసందర్భంగా ఆలయ తాత్కాలిక కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి మాట్లాడుతూ వేలం పాటదారులు ఈనెల 6 నుంచి 20వ తేదీ వరకు మాత్రమే టెంకాయలు, లడ్డూప్రసాదాలు, కొబ్బరిచిప్పలపోగు చేసుకోవాలన్నారు. పెద్దసైజు టెంకాయ రూ.30ల చొప్పున విక్రయించాలన్నారు. 70 గ్రాముల బరువున్న లడ్డూ ప్రసాదం రూ.15ల చొప్పున విక్రయించాలన్నారు. కమిటీ సూచించిన ధరలకంటే అధికంగా విక్రయిస్తే వేలం రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సంతగేటు, బండ్లమెట్ట నిర్వహణకు వేలంపాటలు నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన రాజు రూ.1,91,000లకు పాట పాడి హక్కులను దక్కించుకున్నారు.ఈఓపీఆర్డీ సంజన్న, పంచాయతీ కార్యదర్శి తిప్పన్న, సర్పంచ్ బాలయ్య, సచివాలయ కార్యదర్శి శరత్ పాల్గొన్నారు.

ప్రణాళికలు రూపొందించండి

నంద్యాల: ఈ ఆర్థిక సంవత్సరం వాస్తవ జీడీపీకి అదనంగా 15 శాతం వృద్ధి రేటు సాధించేలా ప్రణాళికలు రూపొందించి, క్షేత్రస్థాయిలో అమలు చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ అధికారి, ఆర్థిక శాఖ రాష్ట్ర కార్యదర్శి జె.నివాస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల స్థూల జాతీయోత్పత్తి 15 శాతం వృద్ధిరేటుపై జిల్లా కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయరంగంతో పాటు అనుబంధ రంగాలు ఉద్యాన, పాడి పరిశ్రమ, చేపల పెంపకం తదితర రంగాలను విస్తృతంగా అభివృద్ధి చేయాలన్నారు. రైతులకు తక్కువ ఖర్చుతో అధిక లాభం వచ్చేలా చూడాలన్నారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో టమాటా ప్రాసెసింగ్ యూనిట్‌కు స్థలం కేటాయించామని, కానీ నిర్మాణం మాత్రం జరగలేదని జిల్లా స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డీఆర్‌ఓ రామునాయక్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ లక్ష్యాలు సాధించండి

నంద్యాల: ఉపాధి హామీ పథకంపై ప్రత్యేక దృష్టి సారించి కేటాయించిన లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఎంపీడీఓ, ఏపీడీలను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఉపాధి హామీ పనుల లక్ష్య ప్రగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు కలెక్టరు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో 537 పశువులకు నీటితొట్ల నిర్మాణాలను ఈనెల 10లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్దేశించిన 2,500 సేద్యపు నీటి కుంటల నిర్మాణ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు 20 శాతం ఉపాధి కూలీలు సేద్యపు నీటి కుంటల పనులకు హాజరయ్యేలా చూడాలన్నారు. వర్షాకాలం వచ్చేలోపు పంట కాలువ పనులను పూర్తి చేయించాలన్నారు.

ఆధ్యాత్మికం

కుమారస్వామికి విశేష పూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమ హాక్షేత్రం పరిధిలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలు వీరభద్ర స్వామి వారికి మంగళవారం సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడున వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలు నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. అనంతరం నందీశ్వర స్వామికి నూతన వస్త్ర సమర్పణ చేశారు. నానబెట్టిన శనగలను, ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.



శనగల బసవన్న కు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



క్షేత్రపాలకుడు బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

8న సర్వసభ్య సమావేశం

పాములపాడు: ఈనెల 8న స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు హాజరుకానున్న సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో రావాలన్నారు.

91.52 శాతం పింఛన్ల పంపిణీ

పాములపాడు: మండల వ్యాప్తంగా మొదటి రోజే 91.52 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపార. మంగళవారం ఆయన చెలిమిల్ల, తుమ్మలూరు, క్రిష్ణారావుపేట గ్రామాల్లో పింఛన్ పంపిణీని పరిశీలించారు. 5,682 మందికి గానూ 5,200 మందికి పింఛన్ అందజేసినట్లు ఆయన తెలిపారు.

● జూపాడుబంగ్లా: మండల వ్యాప్తంగా మొదటి రోజు 93.10 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. 4,910 పింఛన్లు మంజూరు కాగా మంగళవారం సాయంత్రంలోపు 4,571 మందికి అందజేశామన్నారు. మిగతా 339 మందికి బుధవారం సాయంత్రంలోగా పంపిణీ చేస్తామన్నారు.

● పింఛన్ల పంపిణీ

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో మంగళవారం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ నాగభూషణంశెట్టి, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు తెలిపారు. పట్టణంలో 4,236 పింఛన్లకు గాను 3,918 పింఛన్లను పంపిణీ చేశామని, గ్రామాల్లో 4,720 పింఛన్లకు గాను 4,326 పింఛన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. మండలంలో దాదాపు 89 శాతానికి పైగా పింఛన్లు అందజేసినట్లు తెలిపారు.

భక్తులతో మర్యాదపూర్వకంగా మెలగాలి

మహానంది: మహానంది దేవస్థానం పరిధిలో టోల్‌గేట్ల నిర్వహణ, అభిషేక సామగ్రి, పూలదుకాణం, సెల్‌ఫోన్లు భద్రపరుచుకునే దుకాణాల నిర్వహణకు దక్కించుకున్న టెండరుదారులు భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పాత టెండరుదారుల గడువు ముగియడంతో నూతన టెండరుదారులు మంగళవారం దుకాణాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ భక్తులతో వాగ్వాదానికి దిగకుండా, ఏవైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. దేవస్థానం నిర్ణయించిన ధరలను మాత్రమే వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యశస్విని తదితరులు పాల్గొన్నారు.

ఇనుప సామగ్రి చోరీ

మహానంది: మండలంలోని గాజులపల్లె రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే పనులు చేసేందుకు తెచ్చిన ఇనుప సామగ్రి చోరీకి గురైనట్లు ఎస్‌ఐ రామమోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రైల్వే పనులు చేస్తున్న సైట్ ఇంజినీర్ సుమంత్ కుమార్ ఫిర్యాదు చేశారన్నారు. సోమవారం రాత్రి గాజులపల్లె ఆర్ఎస్ వద్ద పనులు చేస్తున్న ప్రాంతంలో ఉంచిన రూ.2.50 లక్షల విలువైన ఇనుపరాడ్లు చోరీకి గురైనట్లు చెప్పారన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

వెలుగోడు: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలో మంగళవారం ఉపాధి పనులు ప్రారంభించారు. ముందుగా గాలేరు గంగమ్మ గుడి వద్ద పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. పనులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, నాయకులు సూచించారు.

అక్రమ మోటార్లు నియంత్రించండి

పగిద్యాల: అక్రమ మోటార్లు నియంత్రించి కుళాయిల ద్వారా ఇంటింటికి నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని పాత ముచ్చుమర్రి గ్రామస్తులు కోరుతున్నారు. ఎగువ ప్రాంతంలో ఉండే కుళాయి కనెక్షన్‌దారులు అక్రమంగా మోటార్లు వినియోగిస్తుండటంతో దిగువకు నీరు రావడం లేదన్నారు. అక్రమ మోటార్లను నియంత్రించాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మోటార్లను నియంత్రించి తమకు నీళ్లు అందేలా చూడాలని పలువురు కోరారు. ఈ విషయమై ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి కాశీంలను వివరణ కోరగా ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదని చెప్పుకొచ్చారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

కొత్తపల్లి: ఉగాది పర్వదినం సందర్భంగా మండలంలోని కొక్కెరంచ గ్రామంలో చెన్నకేశవ స్వామి గుడి తరఫున మంగళవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పాములపాడు మండలం చెలిమిల్ల గ్రామానికి చెందిన చిన్న చెన్నయ్య వృషభాలు విజేతగా నిలిచి రూ.20 వేల నగదు బహుమతి కైవసం చేసుకున్నాయి. మిడుతూరు మండలం రోళ్లపాడు గ్రామానికి చెందిన డాపిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎడ్లు ద్వితీయ, ఓర్వకల్లు మండలం బాపనపల్లి గ్రామానికి చెందిన మౌలాలి వృషభాలు తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. కొత్తపల్లి మండలం కొక్కెరంచ గ్రామానికి చెందిన నాగేశన్న, పగిద్యాల మండల నెహ్రూనగర్ గ్రామానికి చెందిన వడ్డె రవికుమార్‌లు వృషభాలు సంయుక్తంగా నాల్గవ బహుమతి గెలుపొందాయి. విజేత ఎడ్ల యజమానులకు అతిథుల చేతులమీదుగా నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు విష్ణువర్ధన్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, నాయకులు రవీంద్రా రెడ్డి, జయరామ్, తదితరులు పాల్గొన్నారు.

కూల్‌డ్రింక్స్ జోలికి వెళ్లొద్దు

నంద్యాల(న్యూటౌన్): కూల్‌డ్రింక్స్ జోలికి వెళ్లకుండా సహజ పానియాలు తాగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి గోపాల్, గౌరవ సలహాదారు రామరాజు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పీవీప్రసాద్ సూచించారు. కూల్‌డ్రింక్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వారు మంగళవారం సాయిబాబానగర్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూల్‌డ్రింక్స్‌లో హానికరమైన క్రిమిసంహారక మందుల అవశేషాలున్నాయని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సంస్థలు పలు నివేదికలో వెల్లడించాయన్నారు. వాటి జోలికి వెళ్లకుండా చల్లని మజ్జిగ, నిమ్మరసం, పండ్ల రసాలు, కొబ్బరినీళ్లను తాగాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు రమణ, ఖాజా, సంజీవ్‌కుమార్, పునీత్, బాలు, వీరసేన, బాలహుసేని, రమణ తదితరులు పాల్గొన్నారు.



సాయిబాబానగర్‌లో అవగాహన కల్పిస్తున్న జేవీవీ నాయకులు

జార్ఖండ్ మహిళ ఆత్మహత్య

బేతంచెర్ల: జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన బేతంచెర్ల అయ్యలచెర్వులో మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. జార్ఖండ్ రాష్ట్రం సాలీగూటు గ్రామానికి చెందిన హైబురు, భార్య చంద్రటియూ (35) నాలుగు నెలల క్రితం అయ్యలచెర్వుకు వచ్చారు. ఇక్కడున్న పాలీస్ ఫ్యాక్టరీలో హైబురు పనిచేస్తున్నాడు. పాలీస్ ఫ్యాక్టరీకి చెందిన ఓ గదిలో ఇద్దరూ నివాసం ఉంటున్నారు. మంగళవారం భర్త పనికి వెళ్లగా ఆమె ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త ఇంటికి వచ్చి చూడగా ఫ్యానుకు వేలాడుతూ కనిపించింది. వెంటనే కిందకు దించి కొన ఊపిరితో ఉన్న ఆమెను కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు ఏఎస్‌ఐ వెల్లడించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదని.. దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు కలెక్టరేట్ ఎదుట నిరసన

బనగానపల్లె: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట బుధవారం తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు మధుసూదన్‌రావు, మాధవస్వామి, సత్యప్రకాష్, శ్రీనివాసరెడ్డి కోరారు. మంగళవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన చేస్తున్నట్లు తెలిపారు.

సాగునీటి సరఫరా కొనసాగించాలి

బండిఆత్మకూరు: తెలుగు గంగ ప్రాజెక్ట్ మూడవ బ్లాక్ పరిధిలోని పొలాలకు సాగునీటి సరఫరా కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈనెల 3వ తేదీతో సాగునీటి సరఫరా నిలిపేయనున్నట్లు తెలుసుకుని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సరిగా నీరు అందక తమ వరి పొలాలు ఎండిపోతున్నాయని, ఈక్రమంలో నీటి సరఫరాను పూర్తిగా నిలిపేస్తే పంటలు చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. కనీసం ఈనెలాఖరు వరకైనా సాగునీటిని సరఫరా చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

నేటి అర్ధరాత్రి నుంచి జ్యోతి మహోత్సవం

బనగానపల్లె: నందవరం చౌడేశ్వరిదేవి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి నుంచి జ్యోతి మహోత్సవాలు జరగనున్నాయి. ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తొగటవీర క్షత్రియులు గ్రామంలోని చెన్నకేశవస్వామి దేవాలయం వద్ద నుంచి గోధుమ పిండి, నెయ్యి, బెల్లంపాకంతో తయారు చేసిన పదార్థంలో జ్యోతిని వెలిగించుకుని తలపై పెట్టుకుని భక్తి గీతాలు ఆలపిస్తూ గురువారం ఉదయానికి అమ్మవారి ఆలయానికి చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో నడిచి వెళ్లనున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించనున్నారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు.

గ్రామ దేవతలకు బోనాల సమర్పణ





హుసేనాపురంలో సుంకులమ్మకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు, ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బేతంచెర్ల: ఉగాదిని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు గ్రామ దేవతలకు మంగళవారం బోనాలు సమర్పించారు. బేతంచెర్ల, ఆర్ఎస్ రంగాపురం, సిమెంట్ నగర్, ముద్దవరం, మర్రికుంట, హుసేనాపురం, గూటుపల్లె గ్రామాల్లోని మారెమ్మ, సుంకులమ్మలకు మంగళవాయిద్యాల మధ్య మహిళలు సామూహికంగా బోనాలతో ఊరేగింపుగా వెళ్లి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాల్లో బండలాగుడు పోటీలను నిర్వహించారు.

తండ్రీ, కొడుకుపై దాడి

కొలిమిగుండ్ల: వాహనం పార్కింగ్ విషయంలో వాగ్వాదం చోటుచేసుకోవడంతో తండ్రీ,కొడుకుపై మంగళవారం దాడి జరిగింది. సీఐ రమేష్‌బాబు వివరాల మేరకు.. పెట్నికోటలో దూదేకుల సుబహాని ఇంటి ముందు బైక్‌ను పార్క్ చేసుకున్నాడు. అదే వీధిలో ఉంటున్న దూదేకుల నబీరసూల్ ట్రాక్టర్ వెళ్లేందుకు బైక్ అడ్డంగా ఉండడంతో వాగ్వావాదం చోటు చేసుకుంది. దీంతో తండ్రీ,కుమారుడు బాబు, సుబహానిలపై నబీరసూల్ కుటుంబ సభ్యులు కట్టెలు, రాళ్లతో దాడికి దిగారు. ఇద్దరి తలకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని అవుకు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు నబీరసూల్, చిన్న పుల్లయ్య, ఉసేని, బినాభి, పుల్లమ్మతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.





గాయపడిన బాబు, సుబహాని